

బాల్యం బలికానివ్వం

జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి నిఘా ఉంచింది. - 8లో..



ఆక్వా దుకాణంలో చోరీ

ఆక్వా దుకాణంలో దొంగలు చొరబడి చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి టంగుటూరులో చోటుచేసుకుంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /21

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

సీఎల్ఐఎస్‌సీ పరీక్షకు 6లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: సర్టిఫికెట్ కోర్సు ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (సీఎల్ఐఎస్‌సీ-67వ బ్యాచ్) పరీక్షలు ఈనెలలో నిర్వహిస్తారని డీఈవో పిల్లి రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఈనెల 6వ తేదీలోగా అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.60 అపరాధ రుసుంతో ఈనెల 9వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. సంబంధిత పరీక్ష రుసుమును సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు సకాలంలో చెల్లించాలని డీఈవో పిల్లి రమేష్‌బాబు సూచించారు.

గ్రహణమొర్రి సమస్యలకు ఉచిత నిర్ధారణ పరీక్షలు

ఒంగోలు: గ్రహణ మొర్రి, గ్రహణ శూల సమస్యలతో బాధపడుతున్న వారికి ఈనెల 7న స్థానిక సమగ్రశిక్ష సమావేశ మందిరంలో ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో పిల్లి రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ నిర్ధారణ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. హైదరాబాదులోని బసవతారకం స్మైల్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సహిత విద్యా విభాగం, సమగ్రశిక్ష ఒంగోలు సమగ్రశిక్ష ఈ పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. నిపుణులైన వైద్య సిబ్బందిచేత ఉచిత నిర్ధారణ శిబిరం నిర్వహించి, శస్త్ర చికిత్స అవసరం అని నిర్ధారించిన వారికి ఉచితంగా ఆపరేషన్, మందులు, వసతి, రవాణా వంటి సదుపాయాలు కల్పిస్తారన్నారు. భవిత, నాన్‌భవిత కేంద్రాల్లో పనిచేసే రిసోర్సు పర్సన్లు, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే స్పెషల్ టీచర్లు ఈ విషయాన్ని వారి మండల / పాఠశాల పరిధిలో సమస్యలతో బాధపడేవారికి తెలియజేసి అర్హులైన వారంతా శిబిరంలో పాల్గొనేలా చేయాలన్నారు. ఈ శిబిరంలో పాల్గొనేవారికి వయస్సుతో సంబంధం లేదని, పాల్గొనదలచిన వారు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు వంటి ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ 9908424620 ను సంప్రదించాలన్నారు.

త్రిపురాంతక ఆలయంలో వేలం పాట



త్రిపురాంతకం: స్థానిక త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో 2023 మే 1 నుంచి 2024 ఏప్రిల్ 30వ తేదీ వరకు నాలుగు ఐటమ్స్‌కు సంబంధించి బుధవారం వేలంపాట నిర్వహించినట్లు ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఉభయ దేవస్థానాల వద్ద కొబ్బరికాయలు అమ్ముకునేందుకు రూ.20,22,000కు, భక్తులు సమర్పించిన చీరలు, రవికలు పోగుచేసుకునేందుకు రూ.4,44,000, కొబ్బరిచిప్పలు పోగుచేసుకునేందుకు రూ.3,95,000, కాఫీ, టీ, టిఫిన్, కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.2,30,000కు వేలం పాట పాడినట్లు వివరించారు. ఆలయ చైర్మన్ సమక్షంలో వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు.

ఉప్పు ధర టాప్..!

ఉప్పు ధరలు రైతుల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. ఒకప్పుడు 75 కేజీల బస్తా రూ.60 ఉండేది. ఐదేళ్ల ముందు వరకూ సరైన ధరలు రాక రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. కనీస పెట్టుబడి రాక అప్పులు పాలయ్యేవారు. మారిన వాతావరణ పరిస్థితులు, మార్కెట్‌లో కూడా మంచి ధర పలుకుతుండడంతో రైతుల దశ తిరిగింది. నాలుగేళ్లుగా ఊహించనంతగా పెరిగాయి. ప్రస్తుతం 75 కేజీల బస్తా రూ.265 నుంచి రూ.280 మధ్య పలుకుతోంది. ధరలు ఆశాజనకంగా ఉండటంతో పూర్తిస్థాయిలో రైతులు ఉప్పుసాగుకు నిమగ్నమయ్యారు. ఉప్పు కొఠారులన్నీ కూలీలతో సందడిగా మారాయి.



ఉప్పు కొఠారులలో తయారైన ఉప్పును బస్తాలలో నిల్వ చేస్తున్న కూలీలు

- ఈ ఏడాదీ తెల్ల బంగారానికి మంచి రోజులు
- 75 కేజీల బస్తా ధర రూ.265 నుంచి రూ.280
- వరసగా నాల్గో సంవత్సరం కూడా ఆశాజనకంగా ధరలు
- గతంలో 75 కేజీల బస్తా ధర రూ.60 నుంచి రూ.75 మాత్రమే
- ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఆనందంలో ఉప్పు రైతులు

సింగరాయకొండ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉప్పు సాగుకు మంచి డిమాండ్ ఉంది. చినగంజాం, కనపర్తి, పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో సుమారు 4 వేల ఎకరాల్లోని ఉప్పుకొఠారుల్లో ఉప్పు సాగవుతోంది. ఏటా వర్షాకాలం మినహా మిగిలిన కాలాల్లో అనగా 9 నెలల పాటు ఉప్పు సాగు జరుగుతోంది. నెలకు సుమారు 20 వేల టన్నుల వరకు ఉప్పు ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం వాతావరణం అనుకూలిస్తుండడంతోపాటు ధరలు సైతం ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో వాతావరణం అనుకూలించక పోవటంతో ధరలు గణనీయంగా పడిపోయి ఆర్థికంగా నష్టపోయిన రైతులు పొట్టకూటి కోసం ఇతర పనుల వైపు దృష్టిసారించిన దుస్థితి ఉండేది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాతావరణం అనుకూలించడంతో పాటు మార్కెట్లో ధరలు పెరుగుతున్నాయి. వరసగా నాల్గో సంవత్సరం కూడా ధరలు పెరుగుతూ ఉన్నాయి.

ఆశాజనకంగా ధరలు

ప్రస్తుతం ఉప్పు ధర నాణ్యత ఆధారంగా చినగంజాం, సింగరాయకొండ ప్రాంతాల్లో 75 కేజీల బస్తా ధర రూ.265 నుంచి రూ.280 మధ్య ఉంది. 2014-2019 వ సంవత్సరం వరకు వర్షాభావ పరిస్థితుల వల్ల ఉప్పు రైతుకు నష్టాలే మిగిలాయి. గిట్టుబాటు ధర లభించకపోవడం, వ్యాపారులంతా సిండికేట్ కావడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. 2015వ సంవత్సరంలో 75 కేజీల బస్తా ధర రూ.60 ఉండేది. 2016లో రూ.60, 2017లో రూ.90, 2018లో రూ.100, 2019లో రూ.120 గా ధర పలికేది. 2020 నుంచి రైతుల పరిస్థితి మారిపోయింది. 2020 నుంచి 22వ సంవత్సరం వరకు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 75 కేజీల బస్తా ధర ఏకంగా రూ.200 నుంచి రూ.225 కు చేరుకుంది. జిల్లా నుంచి రాష్ట్రంతో పాటు, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రకు ఉప్పు సరఫరా అవుతోంది. దీంతో నాలుగేళ్లుగా ధరలు పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లో రూ.265 నుంచి రూ.285 మధ్య ధర ఉంది. మరింత ధర లభించే అవకాశం ఉన్నా కొంత మంది వ్యాపారులు సిండికేట్‌గా మారడం రైతులకు శాపంగా మారింది. వీరు సిండికేట్ కాకపోతే 75 కేజీల బస్తా ధర రూ.300లు దాటిపోయేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆర్‌బీకే ద్వారా ఉప్పు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సిండికేట్ సమస్య లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



ఉప్పు బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న కూలీలు



ఉప్పుకొఠారు

రోజు 20 లారీల్లో..

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రతిరోజు 20 లారీల వరకు ఉప్పు రవాణా అవుతోంది. చినగంజాం ప్రాంతం నుంచి సుమారు 13 లారీలు, సింగరాయకొండ మండలంలో సుమారు 7 లారీల వరకు ఉప్పు రవాణా అవుతోందని రైతులు తెలిపారు.

సిండికేట్‌కు అడ్డుకట్ట వేయాలి..



ఉప్పు కొఠారులు సాగు చేస్తున్నాను. గత మూడేళ్లలాగే ఈ సంవత్సరం కూడా ఉప్పు ధరలు బాగా ఉన్నాయి. వ్యాపారుల సిండికేట్ కారణంగా ధరలు పెరగాల్సి ఉన్నా ఆశించిన స్థాయిలో పెరగటం లేదు. ఆర్‌బీకే ద్వారా ఉప్పు కొనుగోలు చేయాలి.

– పెదనబోయిన వెంకటేశ్వర్లు, ఉప్పు రైతు, బింగినపల్లి

ధరలు ఆశాజనకం..



ఒక ఎకరాలో ఉప్పు సాగు చేస్తున్నాను. గతంలో వ్యాపారుల సిండికేట్, వర్షాభావ పరిస్థితుల కారణంగా గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయాం. ఈ సంవత్సరం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

– ములుగు జాలిరెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

ఎస్ఎస్ ట్యాంకులకు సాగర్ జలాలు

- రామతీర్థం నుంచి సాగర్ కాలువ ద్వారా వస్తున్న నీరు
- వేసవిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్యాంకులు నింపుతున్నామన్న నగర కమిషనర్

ఒంగోలు సబర్బన్: రామతీర్థం నుంచి సాగర్ నీటిని ఒంగోలు నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నగరంలోని సమ్మర్ స్టోరేజి ట్యాంకులకు విడుదల చేశారు. ఈ మేరకు బుధవారం వస్తున్న సాగర్ నీటిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. రామతీర్థం నుంచి సాగర్ వస్తున్న తీరును కమిషనర్ సాగర్ కాలువ పొడవునా పర్యటించారు. ఎక్కడైనా అడ్డంకులు ఏమైనా ఉన్నాయా అని కూడా కాలువ వెంటే ప్రయాణించి నీటి ప్రవాహ వేగాన్ని కూడా నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఒంగోలు నగర ప్రజలకు తాగునీటిని అందించే నగరంలోని సమ్మర్ స్టోరేజి ట్యాంకులు రెండింటినీ నింపుతున్నామన్నారు. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేసి ఒంగోలు నగర ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించనున్నామన్నారు. ప్రస్తుతం ఒంగోలులో సమ్మర్ స్టోరేజి ట్యాంక్-1లో గరిష్ట నీటి నిల్వ 1950 మిలియన్ లీటర్లకు గాను 915.34 మిలియన్ లీటర్లు నీరు నిల్వ ఉన్నాయన్నారు. అదేవిధంగా రెండో సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లో గరిష్ట నీటి నిల్వ 3750 మిలియన్ లీటర్ల గాను 2916.56 మిలియన్ లీటర్లు నిల్వ ఉన్నాయన్నారు. మొత్తం కలిపి 5800 మిలియన్ లీటర్ల సామర్థ్యానికిగాను 3831 మిలియన్ లీటర్లు నిల్వ ఉన్నాయని వివరించారు. రెండు వారాల్లో రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నిండుతాయని చెప్పారు. సాగర్ నీరు విడుదలవుతున్న అన్ని రోజులు నగర పాలక సంస్థ అధికారులు నీరు వస్తున్న తీరును, కాలువ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఎప్పటికప్పుడు సాగర్ నీటి విడుదల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కూడా ఆదేశించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. రానున్న వేసవిలో నగర ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కూడా బాలినేని ఆదేశించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ నరశింహారావు ఉన్నారు.



ఎస్ఎస్ ట్యాంక్-1లోకి వస్తున్న సాగర్ నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

నిష్పక్షపాతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- రిటర్నింగ్ అధికారి, చిత్తూరు కలెక్టర్ హరినారాయణన్
- పోలింగ్ నిర్వహణపై పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతులు

సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ లో పీవో, ఏపీవోల పాత్ర కీలకమని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా విజయవంతంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ యం.హరి నారాయణన్ అన్నారు. ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులుగా నియమించిన వారికి ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణ తరగతులు బుధవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ తరగతులను జాయింట్ కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 13 న జరగనున్నాయని, పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. పీవోలు, ఏపీవో లు ఎన్నికలు ఎటువంటి పొరపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ప్రిసైడింగ్ అధికారులకు ఇచ్చిన హ్యాండ్ బుక్ లోని అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ రోజున బ్యాలెట్ బాక్స్ ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లు, పీవో డైరీ, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను సీల్ వేయడం తదితర అంశాలపై అవగాహన ముఖ్యమన్నారు. పీవోలు, ఏపీవోలుగా నియమితులైన వారు వారికి కేటాయించిన రెవెన్యూ డివిజన్ అధికారికి ఈ నెల 12 న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ సామగ్రిని అదే రోజున తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు సాయంత్రానికి చేరుకోవాలని చెప్పారు. పోలింగ్ రోజున పోలింగ్ ఏజెంట్ లకు పాసుల పంపిణీ, వారికి సీటింగ్ ఏర్పాట్లు ఉదయం 7 గంటలకు పూర్తి చేసి ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యేలా ప్రిసైడింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ బూత్ లో ఓటు వేసేందుకు క్యాబిన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రిసైడింగ్ అధికారులు అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోతే సహాయ ప్రిసైడింగ్ అధికారులు పీవోలుగా వ్యవహరిస్తారన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి సంతకాలు తీసుకొని రెవెన్యూ డివిజన్ రిసెప్షన్ సెంటర్ స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్స్‌లు చేర్చి, పీవో డైరీ ఇతర ప్రొఫార్మాలను అందజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ హ్యాండ్ బుక్‌లోని అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఏఆర్‌ఓ, డీఆర్‌ఓ ఎస్.రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల విధులపై అధికారులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి యం.హరి నారాయణన్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్

విగ్రహాలకు ముసుగులు వేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలు, చిత్రపటాలు కనిపించకుండా ముసుగులు వేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ సెక్రటరీని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై బుధవారం కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం వీడియో సమావేశానికి సంబంధించి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పాఠశాలల పనివేళల్లో వాటి ప్రాంగణాలను ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు వినియోగించకుండా పర్యవేక్షించాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని త్వరగా ముగించాలన్నారు. బ్యాలెట్ పేపర్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల ఫిర్యాదులు, కోడ్‌ఉల్లంఘన విషయాలను కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1077కు ఫోన్ చేసి తెలియచేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ ఓబులేసు, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీఈఓ రమేష్, ఎస్‌డీసీలు సరళా వందనం, గ్లోరియా, ఉమాదేవి, శ్రీదేవి, సీపీఓ వెంకటేశ్వర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో కలెక్టర్, జేసీ

గంజాయి కేసులో సుబ్బారావు గుప్తా

- స్థానిక వెంకటేశ్వర కాలనీ వద్ద తనిఖీల్లో పట్టుకున్న పోలీసులు
- ఒక కేజీ 5 గ్రాముల గంజాయి స్వాధీనం
- 2020లో ఇతనిపై తెలంగాణ మద్యం విక్రయ కేసు

ఒంగోలు: నగరంలో వివాదాస్పదుడిగా పేరొందిన సోమిశెట్టి సుబ్బారావు గుప్తా గంజాయి అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ద్విచక్రవాహనంపై గంజాయిని తరలిస్తుండగా బుధవారం పోలీసులు అతనిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం సుబ్బారావు గుప్తా ద్విచక్ర వాహనంపై వెంకటేశ్వర కాలనీ నుంచి అద్దరోడ్డు వైపు వస్తున్నాడు. అదే సమయంలో తాలూకా పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తున్నారు. అటుగా వస్తున్న అతనిని కూడా ఆపి తనిఖీ చేసేందుకు యత్నించారు. అయితే సుబ్బారావు గుప్తా వాహనం ఆపకుండా వెళ్లిపోతుండగా పోలీసులు బలవంతంగా నిలిపి తనిఖీ చేశారు. అతని వద్ద ఒక కిలో 5 గ్రాముల గంజాయి లభించింది. దీంతో అతనిని అరెస్టుచేసి తాలూకా పోలీసుస్టేషన్‌కు తరలించారు. నగరంలో గంజాయి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఇటీవల పోలీసుల దృష్టికి వచ్చింది. యువత ఎక్కువగా దీనిని తీసుకుంటున్నట్లుగా గుర్తించారు. కీలక నిందితుని కోసం పోలీసులు దృష్టి సారించారు. పాత గంజాయి నిందితులపై నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో తాలూకా సీఐ శ్రీనివాసరావు సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా సుబ్బారావు గుప్తా పట్టుబడ్డాడు. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. గంజాయి ఎక్కడ నుంచి వచ్చింది?. దీనికి సూత్రధారులు ఎవరు ? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

2020లోనే అక్రమ మద్యం కేసులో నిందితుడు

గంజాయిని అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయిన సుబ్బారావు గుప్తా గతంలో తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న కేసులో కీలక నిందితుడిగా ఉన్నాడు. 2020 సంవత్సరంలో తెలంగాణ నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అతనిపై కేసు నమోదు చేశారు. తెలంగాణ నుంచి అడ్డదారిలో మద్యం తీసుకొచ్చి జిల్లాలో అక్రమంగా విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అప్పటి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.తిరుపతయ్య అరెస్టు చేశారు. వారివద్ద నుంచి మద్యం సీసాలతోపాటు నగదు సీజ్ చేశారు. అదుపులోకి తీసుకున్న వారిని పూర్తి స్థాయిలో విచారించారు. ఈ వ్యవహారంలో సుబ్బారావు గుప్తా కీలక నిందితునిగా గుర్తించారు. దీంతో మొదటి ఇద్దరు నిందితులను ఎస్ఈబీ అధికారులు అరెస్టు చేశారు. అనంతరం కీలక నిందితుడిగా ఉన్న సుబ్బారావు గుప్తా కోసం గాలింపులు చేశారు. అయితే పోలీసులు తనను అరెస్టు చేయకుండా బెయిల్ తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. గంజాయిని తరలిస్తూ బుధవారం సుబ్బారావు గుప్తా పట్టుబడడంతో 2020లో నమోదైన అక్రమ మద్యం విక్రయ కేసు వెలుగులోకి వచ్చింది. అయితే సుబ్బారావు గుప్తా తనను అవమానించాడంటూ నగర మేయర్ గంగాడ సుజాత ఇప్పటికే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టిన సంగతి తెలిసిందే. ఒక వైపు తనపై అక్రమ మద్యం విక్రయాల కేసులున్నా ఏమాత్రం లెక్కచేయకుండా నిషేధిత గంజాయిని సైతం అక్రమంగా రవాణా చేస్తూ సుబ్బారావు గుప్తా పోలీసులకు నేరుగా చిక్కడం గమనార్హం. మీడియా వేదికగా అందర్నీ అవినీతిపరులని ఇష్టం వచ్చినట్టు ఆరోపణలు చేసే సుబ్బారావు గుప్తా గంజాయి, అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతూ అడ్డంగా దొరికిపోవడం గమనార్హం.

క్లుప్తంగా

కాలభైరవస్వామి విగ్రహానికి పగుళ్లు

● త్వరలోనే నూతన విగ్రహం ప్రతిష్ఠిస్తామని ఈఓ వెల్లడి



పగుళ్లిచ్చిన కాలభైరవస్వామి విగ్రహం

సింగరాయకొండ: పాత సింగరాయకొండలోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న కాలభైరవ స్వామి విగ్రహానికి పగుళ్లిచ్చాయి. ఆ విగ్రహం స్థానంలో త్వరలోనే నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఈఓ పి.కృష్ణవేణి వెల్లడించారు. ఆలయ చరిత్ర ప్రకారం కాలభైరవస్వామి విగ్రహం సుమారు వెయ్యేళ్ల నాటిదని ప్రధాన అర్చకుడు ఉదయగిరి శేష లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న విగ్రహానికి మండపం కూడా నిర్మిస్తామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు పేర్కొన్నారు.

9వ తేదీ నుంచి ప్రీ పబ్లిక్, ఫార్మేటివ్ పరీక్షలు

ఒంగోలు: పదో తరగతి విద్యార్థులకు ప్రీ పబ్లిక్, 1 నుంచి 9వ తేదీ వరకు ఫార్మేటివ్ 4 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రెండు పూటలా 45 నిముషాల చొప్పున 9వ తేదీ ఓరియంటల్ పరీక్ష, 10వతేదీ ఉదయం తెలుగు, సాయంత్రం గణితం, 14వ తేదీ ఉదయం ఆంగ్లం, సాయంత్రం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలు నిర్వహిస్తారు. 6 నుంచి 8 తరగతులకు సాయంత్రం రెండు పరీక్షలు, 9వ తరగతికి ఉదయం రెండు పరీక్షలు నిర్వహిస్తారు. 9వ తేదీ ఓరియంటల్ పరీక్ష, 10వతేదీ తెలుగు, గణితం, 14వ తేదీ హిందీ, సైన్స్, 15వ తేదీ ఆంగ్లం, సోషల్ స్టడీస్ పరీక్షలు జరుపుతారు. ప్రతి పరీక్షకు 45 నిముషాల సమయం మాత్రమే సమయం ఇస్తారు.

ప్రీ పబ్లిక్ పరీక్షలు 9వ తేదీ నుంచే

పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారు. 9వ తేదీ తెలుగు, 10వ తేదీ హిందీ, 14వ తేదీ ఆంగ్లం, 15వ తేదీ గణితం, 16వ తేదీ సైన్స్, 17వ తేదీ సోషల్ స్టడీస్ పరీక్షలు, 18,19 తేదీల్లో ఓరియంటల్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలు ముగియగానే వాటిని మూల్యాంకనం చేసి మార్కులను నమోదు చేయాలని డీఈఓ రమేష్‌బాబు ఉపాధ్యాయులను ఆదేశించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం



మృతదేహం

టంగుటూరు: టంగుటూరు టోల్ ప్లాజా దగ్గరలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతునికి 30 ఏళ్లు ఉంటాయని, ఎరుపు రంగు చొక్కా, బులుగు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు ద్విచక్ర వాహనాలు ఢీ

● ముగ్గురికి గాయాలు

కురిచేడు: మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక ఎన్ఎస్‌పీ కాలువ వద్ద బుధవారం జరిగింది. వివరాల్లోకి వెలితే.. దేకనకొండ గ్రామానికి చెందిన ఎస్ రాంబాబు పూటుగా మద్యం సేవించి ద్విచక్రవాహనంపై దేకనకొండ వెళ్తున్నాడు. ఎన్ఎస్‌పీ కాలువ వద్దకు వెళ్లే సరికి మద్యం మత్తులో ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో శివకృష్ణ అనే వ్యక్తి ఎడమ కాలికి గాయాలయ్యాయి. అలాగే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో పెద్దవరం గ్రామానికి చెందిన యర్రగుంట్ల మరియదాసుకు ఎడమచేయి విరిగింది. క్షతగాత్రులు ఎవరికి వారు వైద్యశాలలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు.

స్థలం వివాదంలో వృద్ధురాలి మృతి

మద్దిపూడి: రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదంలో వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని శివరాయునిపేట దళితవాడలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. మండలంలోని శివరాయునిపేట గ్రామ దళితవాడలో తలిమల ప్రేమ్‌కుమార్, తలిమల జాన్‌పాల్ కుటుంబీకులు, గంట యోషోషువ, గంట ఇజ్రాయిల్ కుటుంబీకుల మధ్య ఇంటి స్థలం వద్ద వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో గొడవ మధ్యలోకి వెళ్లిన వృద్ధురాలు గంట కోటమ్మ(77)ను ప్రేమ్‌కుమార్, జాన్‌పాల్ ఇద్దరూ నెట్టడంతో కింద పడి సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కొండపి సీఐ శ్రీనివాసరావు, ఎస్సై పి. అంకమ్మరావులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కోటమ్మ కుమారుడు ఇజ్రాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాల్యం బలి కానివ్వం

● జిల్లాలో బాల్య వివాహాలకు సమర్థంగా అడ్డుకట్ట
● గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలతో సత్ఫలితాలు

బాల్యానికి మూడుముళ్లు పడుతున్నాయి. అభం శుభం తెలియని వయసులోనే ఆడపిల్లల మెడకు అర్ధాంగి అనే తాడును తగిలిస్తున్నారు. ఆడుతూ పాడుతూ.. చదువుకుంటూ గడపాల్సిన వయసులో బలవంతంగా అత్తారింటికి పంపిస్తున్నారు. ఒకటీరెండేళ్లు తిరిగేసరికి చంటిబిడ్డను చంకనేసుకుని ఆడపిల్లలు అనుభవిస్తున్న బాధలు వర్ణనాతీతం. బాల్య వివాహాలను ఆపేందుకు అనేక చట్టాలను రూపొందించినప్పటికీ అవగాహన లేమి కారణంగా ఎంతో మంది బాలికలు పెళ్లికూతుర్లవుతున్నారు. బాల్య వివాహాల్లో ఏపీలో ప్రకాశం జిల్లా రెండో స్థానంలో ఉన్న నేపథ్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు విశేషంగా కృషి చేస్తున్నాయి.



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మార్కాపురం: బాల్యం వరం లాంటిది. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన లేక 16 ఏళ్లలోపే పిల్లలకు పెళ్ళిలు చేసి బాధ్యత తీరినట్టుగా భావిస్తున్నారు. దీంతో మానసికంగా, శారీరకంగా బాలికలు అవస్థలు పడుతున్నారు. వారి బంగారు భవిష్యత్తు నాశనమైపోతోంది. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామ సచివాలయ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి 18 ఏళ్లలోపు బాలికలకు పెళ్లి చేయడాన్ని ఆపాలని అధికారులను ఆదేశించింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా చేసిన సర్వేలో ఉమ్మడి ప్రకాశం జిల్లా గత ఏడాది రెండో స్థానంలో ఉన్న నేపథ్యంలో బాల్య వివాహాల నిరోధానికి జిల్లా యంత్రాంగం నడుం బిగించింది.

పశ్చిమ ప్రకాశంలో ఎక్కువ

నిరక్ష్యరాస్యత, ఆర్థిక కారణాలు, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో అర్ధవీడు, పుల్లల చెరువు, పెద్ద దోర్నాల, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల, కొత్తపట్నం, అద్దంకి తదితర ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు, బాలల సంరక్షణ సిబ్బంది బాల్య వివాహాల నిరోధానికి చర్యలు చేపట్టారు. గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశారు. సర్వే నిర్వహించి 10వ తరగతి తర్వాత చదువు మానేసిన పిల్లల వివరాలు సేకరించి ట్రాకింగ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది 40 బాల్య వివాహాలు జరిగినట్లు గుర్తించారు.

■ అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామంలో ఫిబ్రవరి 9న బాల్య వివాహం చేస్తున్నట్లు తెలియడంతో ఐసీడీఎస్ అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆ వివాహాన్ని నిలిపివేశారు.
■ కనిగిరి మండలం చాకిరాల గ్రామంలో ఫిబ్రవరి 22న 16 ఏళ్ల బాలికకు పెళ్లి జరుగుతోందన్న సమాచారం రాగానే ఐసీడీఎస్ అధికారులు వెళ్లి ఆపేశారు.
■ హనుమంతునిపాడు మండలం సీతారామపురంలో జనవరి 24న 14 ఏళ్ల బాలిక వివాహాన్ని నిలిపేసిన అధికారులు, తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

అనారోగ్య సమస్యలు

18 ఏళ్ళలోపు బాలికలకు పెళ్ళి చేస్తే శారీరకంగా, మానసికంగా అవస్థలు పడతారు. తాము చదువుకోవాల్సిన సమయంలో కడుపులో బిడ్డను మోయడం వల్ల రక్తహీనతతో పాటు మానసికంగా పలువురు కుంగిపోతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యాశాఖ అధికారులతో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తూ 10వ తరగతి అయిపోగానే కళాశాలల్లో చేర్పే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నేరము-శిక్ష

■ బాల్య వివాహం చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్, వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయవచ్చు. అదేవిధంగా పోలీసులకు(100), చైల్డ్‌లైన్(1098) టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్లు చేసి సమాచారం అందించవచ్చు. అదేవిధంగా క్షేత్ర స్థాయిలో బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా కార్యకర్తలకు కూడా సమాచారాన్ని చేరవేయవచ్చు. బాల్య వివాహాల గురించి సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతారు.

■ బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 ప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహం చేస్తే వారి తల్లిదండ్రులతోపాటు ఆ బాల్య వివాహానికి సహకరించిన వారికి జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు. బాల్య వివాహాలు జరగకుండా ఉత్తర్వులు జారీచేసే అధికారం న్యాయస్థానాలకు ఉంది. అవసరమైతే అలా జరిగిన వివాహాన్ని చెల్లదని కూడా చెప్పే అధికారం ఉంది.

■ బాల్య వివాహ నిరోధానికి రాజ్యాంగంలో ప్రత్యేక సెక్షన్లు రూపొందించారు. ఐపీసీ సెక్షన్ 9 ప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు పెళ్లి చేస్తే వారి కుటుంబీలకు రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారు. ఐపీసీ సెక్షన్ 10 ప్రకారం బాల్య వివాహాలు నిర్వహించినవారికి, సహకరించినవారికి, ప్రోత్సహించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారు. ఐపీసీ సెక్షన్ 12 ప్రకారం బాల్య వివాహానికి ఎవరైనా హాజరైతే వారికి కూడా దాదాపు రెండేళ్ల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారు.

గ్రామ స్థాయిలో కమిటీలు



బాల్య వివాహల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ సచివాలయ, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశాం. కిశోర బాలికల అభ్యున్నతిపై శిక్షణ ఇచ్చాం. మండల స్థాయిలో మహిళా పోలీసులకు, ఏఎన్ఎంలకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నాం. గ్రామ స్థాయిలో సర్పంచ్, వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, ఏఎన్ఎం, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిపి మొత్తం 14 మంది సభ్యులుగా ఉంటారు. వీరు స్కూల్ డ్రాప్ ఔట్స్ వివరాలు సేకరిస్తూ, రికార్డులు నిర్వహిస్తుంటారు. బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– ధనలక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టర్ ఐసీడీఎస్ ఒంగోలు

పోషకాహారంతో క్షయ నయం

● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
● రోగులకు పోషకాహార కిట్లు అందజేత



క్షయ బాధితులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, క్షయ నివారణాధికారి సురేష్

ఒంగోలు అర్బన్: క్రమం తప్పకుండా మందులు వాడుతూ సరైన పోషకాహారం తీసుకుంటే క్షయ వ్యాధి నుంచి సురక్షితంగా బయటపడవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ప్రకాశం భవనంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ రోగులకు ఒక నెలకు సరిపడా పోషకాహార పదార్థాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. దాతలు ముందుకు వచ్చి క్షయ బాధితులకు అండగా నిలవాలని కలెక్టర్ కోరారు. ఒక్కో రోగికి 6 నెలలపాటు ఈ కిట్లను అందించేందుకు రూ.4,200 ఖర్చు అవుతుందని, ఆర్థిక సహాయం చేసేందుకు పలువురు జిల్లా అధికారులు ముందుకు వచ్చారని చెప్పారు. వారితో పాటు భారత్ బయోటెక్ కంపెనీ 25 మందికి, గ్లాండ్ ఫార్మా కంపెనీ 500 మందికి సహాయం చేసేందుకు అంగీకారం తెలిపినట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. కార్యక్రమంలో క్షయ నివారణ అధికారి సురేష్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంఎఫ్ పనులు వేగంగా పూర్తి చేయాలి



డీఎంఎఫ్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: డీఎంఎఫ్ (జిల్లా మినరల్ ఫండ్)తో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో డీఎంఎఫ్ పనుల కేటాయింపు, పురోగతిపై ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు డీఎంఎఫ్ ద్వారా మొత్తం 2341 పనులకు అనుమతులు మంజూరు చేయగా వాటిలో 1103 పనులు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ స్థాయిల్లో ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర పథకాలతో చేపట్టేందుకు అవకాశం లేని అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, కెనాల్ కల్వర్టులు, మరమ్మతులు, పారిశుధ్య పనులు, ఆర్‌ఓ ప్లాంట్ల నిర్మాణం లాంటి అభివృద్ధి పనులను డీఎంఎఫ్ కింద చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఏవిధంగా వినియోగించాలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో గనుల శాఖ డీడీ జగన్నాథరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఆర్‌అండ్‌బి ఎస్ఈ విజయరత్నం, సీపీఓ వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్షా అభియాన్ ఈఈ మన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యు నాయకులు

ఒంగోలు: వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక కోలాస్ హోటల్ వద్దనుంచి హెచ్‌సీఎం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు, అక్కడనుంచి కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు బుధవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రీతి సీనియర్ విద్యార్థి సైఫ్ ర్యాగింగ్ భూతానికి బలైపోవడం దారుణమన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ కారణంగా జూనియర్ విద్యార్థులు బలైపోతున్నారన్నారు. కాలేజీల్లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలు ఉన్నా అవి నిష్ప్రయోజనంగానే ఉన్నాయన్నారు. సైఫ్ చేసిన ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేకే ప్రీతి విషపు ఇంజెక్షన్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ప్రీతి మరణం మరువకముందే ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేటలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న రక్షిత అనే మరో విద్యార్థిని సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ భూతానికి బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇటువంటి విషయాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్, జూనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి స్నేహ పూర్వకంగా మెలిగేటట్లు చేయాలన్నారు. ర్యాగింగ్‌కు బలైపోయిన ప్రీతి, రక్షిత కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వి.రామమోహన్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న, దారా సుబ్బారావు, పీడీఎస్‌యు నాయకులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా దుకాణంలో చోరీ



సంఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

● బీరువాలో ఉంచిన రూ.2.20 లక్షలు మాయం
● పాత నేరస్తుల పనే అంటున్న క్లూస్ టీం

టంగుటూరు: ఆక్వా దుకాణంలో దొంగలు చొరబడి నగదును దోచుకెళ్లిన సంఘటన మంగళవారం రాత్రి టంగుటూరులో చోటుచేసుకుంది. పోలీసులు, ఆక్వా దుకాణం యజమాని తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆలకూరపాడు గ్రామానికి చెందిన దివి పూర్ణచంద్రరావు టంగుటూరులోని అనంతవరం రోడ్డులో నాలుగేళ్లుగా ఆక్వా దుకాణం నిర్వహిస్తున్నారు. గుమస్తా వెంకట్రావు రోజులాగే మంగళవారం సరుకు విక్రయాల లెక్కలు చూసి రూ.2.20 లక్షల నగదును బీరువాలో పెట్టి వెళ్లాడు. బుధవారం ఉదయం 8 గంటలకు గుమస్తా దుకాణం తెరిచి చూడగా.. పై భాగంలో రేకు రెండు చోట్ల పగలగొట్టి ఉంది. దీంతో యజమాని పూర్ణచంద్రరావుకు సమాచారం అందించాడు. నగదు చోరీ కావడంపై దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై శ్రీధర్, క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్‌లను కూడా దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పక్కనే ఉన్న ప్రైవేట్ పాఠశాలలో సీసీ ఫుటేజీ పరిశీలించగా.. దొంగలు రేకులను కట్ చేసే కట్టర్‌తో దుకాణం దక్షిణం వైపు నుంచి గోడ దూకి ప్రవేశించినట్లు కనిపిస్తోంది. వేలి ముద్రలు దొరకకపోవడంతో దొంగలు చేతులకు గౌజులు ధరించారని పోలీసులు నిర్ధారించుకున్నారు. దుకాణ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్సై తెలిపారు.



దుకాణం పైభాగంలో దొంగలు పగలగొట్టిన రేకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మీ



గాయపడ్డ గ్రేస్‌మేరి

బేస్తవారిపేట: మండలంలోని కలగొట్ల సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డు మూలమలుపు వద్ద కారు–ఆటో ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. బేస్తవారిపేట నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటో సలకలవీడు వెళ్తున్న సమయంలో గురజాల నుంచి నంద్యాల వైపుకు సమయంలో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పిడతల ఆదిలక్ష్మి, బోనం అంకయ్య, చింతా గ్రేస్‌మేరిలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సాల్మన్‌రాజు



కలెక్టర్ దినేష్‌కుమార్‌తో సాల్మన్‌రాజు

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.సాల్మన్‌రాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సాల్మన్‌రాజుకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ ఉన్నారు.

గంజాయి స్మగ్లర్ల కోసం వేట!



పోలీసుల అదుపులో ఉన్న ట్రక్కు

టంగుటూరు: భారీ మొత్తంలో గంజాయి తరలిస్తూ టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలో పట్టుబడిన నిందితులను పోలీసులు తమదైన శైలిలో విచారిస్తున్నారు. సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా తమ సిబ్బందితో కలిసి మంగళవారం స్థానిక టోల్ ప్లాజా వద్ద ట్రక్‌ను సీజ్ చేయడంతోపాటు 60 ప్యాకెట్ల (సుమారు 150 కేజీలు) గంజాయిని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. కాకినాడ జిల్లా తుని నుంచి చైన్నై వైపు ప్రయాణిస్తున్న ఆటోలో ఉన్న ఇద్దరు నిందితులను పోలీసులు గోప్యంగా విచారిస్తున్నారు. గంజాయి తరలింపులో ప్రధాన నిందితులైన స్మగ్లర్ల కోసం ఇప్పటికే వేట ప్రారంభించారు. ఒక నిందితుడిని వెంటబెట్టుకుని సీఐ రంగనాథ్ చైన్నై వెళ్లగా, మరో నిందితుడిని వెంటబెట్టుకుని ఎస్సై ఖాదర్ బాషా కాకినాడ పరిసర ప్రాంతాల్లో విచారిస్తున్నట్లు సమాచారం.

బీసీ హాస్టల్‌కు విద్యార్థినుల తరలింపు



బీసీ హాస్టల్‌కు వచ్చిన విద్యార్థినులు

● కలెక్టర్ ఆదేశాలు అమలు చేసిన అధికారులు

సింగరాయకొండ: స్థానిక సాంఘిక సంక్షేమ కాలేజీ బాలికల వసతి గృహం నుంచి బీసీ కాలేజీ బాలికల వసతి గృహానికి విద్యార్థినులను తరలించాలన్న కలెక్టర్ ఆదేశాలను బుధవారం సాయంత్రం కొండపి ఏఎస్‌డబ్ల్యూఓ యు.దానయ్య ఆధ్వర్యంలో అధికారులు అమలు చేశారు. బుధవారం సాయంత్రం ఎస్సీ హాస్టల్‌కు వెళ్లిన కొండపి ఏఎస్‌డబ్ల్యూఓ దానయ్య, ఆర్‌ఐ తన్నీరు తిరుమలరావు, వీఆర్‌ఓ తిరుమల, మహిళా పోలీసు భారతి విద్యార్థినులతో మాట్లాడి బీసీ హాస్టల్‌కు రావాలని సూచించారు. ఆ సమయంలో సస్పెన్షన్‌లో ఉన్న వార్డెన్ ఎస్‌వీ జగదీశ్వరి వచ్చి.. 'మీరు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదు. ఎవరి మాటలు వినాల్సిన అవసరం లేద'ని అనడంతో అధికారులు నివ్వెరపోయారు. అంతటితో ఆగకుండా అధికారులతో వార్డెన్ వాగ్వివాదానికి దిగడంతో సచివాలయ మహిళా పోలీసు నిలువరించింది. చివరకు విద్యార్థినులంతా లగేజీ సర్దుకుని రావడంతో బీసీ హాస్టల్‌కు తరలించారు.